క్లుప్తంగా

ఆటో డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరి

పెనుగంచిప్రోలు: ఆటో డ్రైవర్లు లైసెన్స్లు తప్పకుండా కలిగి ఉండాలని ఎస్ఐ సీహెచ్ కె.దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక పోలీస్స్టేషన్లో మంగళవారం ఆయన ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లు తమ వంతు బాధ్యత కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించకూడదన్నారు. విధిగా బీమా చెల్లించాలన్నారు. వాహనాలను అతి వేగంగా నడపకూడదన్నారు. రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ నిలిపినా, నిబంధనలు అతిక్రమించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా జలజీవన్ పనులు



మంగొల్లు(వత్సవాయి): జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలో జరుగుతున్న పనులను హార్ట్ ఐఎస్ఏ సిబ్బంది మంగళవారం పరిశీలించారు. వీడబ్ల్యూఏఎస్, గ్రామస్తులు సంయుక్తంగా వేస్తున్న తాగునీటి పైపులైన్ పనుల నాణ్యతను తనిఖీచేశారు. జలజీవన్ మిషన్లో పారదర్శకత, జవాబుదారీతనం కోసం ప్రజలకు అవగాహన సదస్సులను నిర్వహిస్తామన్నారు. ప్రజలకు నీటినాణ్యత, నీటిభద్రత పనుల పరిష్కారాల గురించి సబ్డివిజన్ పరిధిలో కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు హారిక లక్ష్మి, లక్ష్మణరావు, గ్రామీణ నీటి, పారిశుద్ధ్య కమిటీ చైర్మన్ అన్నెపాక నరసింహారావు, ఎంపీటీసీ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ బాధితులను ఆదుకోవాలి

కంచికచర్ల(వీరులపాడు): మణిపూర్లో ఇటీవల జరిగిన ఘటనలలో బాధితులను ఆదుకోవడానికి దాతృత్వంతో ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని నేషనల్ క్రిస్టియన్ బోర్డు జాతీయ అధ్యక్షుడు జాన్ మాస్కు విజ్ఞప్తి చేశారు. కంచికచర్ల మండలంలోని చెవిటికల్లు గ్రామంలోని దైవస్వరూపి ప్రార్థనా మందిరంలో మంగళవారం నేషనల్ క్రిస్టియన్ బోర్డు జిల్లా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద ప్రజలకు విరాళాలు అందించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మనోజ్కుమార్, నవీన్కుమార్, చింతయ్య, శేఖర్బాబు, డేవిడ్ మార్కు, సుందర్పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్లో సాంకేతిక సమస్య గంటల్లో పరిష్కరించిన ఇంజినీర్లు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్లో ఏర్పడిన సాంకేతిక సమస్య సంస్థ ఇంజినీర్లు గంటల్లో పరిష్కారానికి కృషి చేశారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతకు సోమవారం మధ్యాహ్నం 3.30గంటలకు స్విచ్యార్డ్లో ప్రొటెక్షన్ కరెంట్ ట్రాన్స్ఫార్మర్లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో 2,3,6,5 యూనిట్లలో 840 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. తక్షణమే స్పందించిన ఇంజినీర్ల కృషితో రాత్రి 8గంటలలోపు అన్ని యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించారు. మంగళవారం 7వ యూనిట్ సాంకేతిక సమస్యతో నిలిచింది. దీంతో 500 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి ఆగింది. ఇంజినీర్లు సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సంస్థ అధికారులు తెలిపారు.

పూర్ణాహుతి నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరుగుతున్న చండీ రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞంలో భాగంగా ఈ నెల 17న జరిగే పూర్ణాహుతి కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి, గవర్నర్ అబ్దుల్ నజీర్ వస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు, సిబ్బందికి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా సూచించారు. మహా యజ్ఞం ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని తీసుకోవాల్సిన భద్రత చర్యలను రాష్ట్ర దేవాదయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణతో సీపీ రాణా చర్చించారు. అనంతరం నిర్వహించిన ట్రయిల్ రన్ను పర్యవేక్షించి పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ముగింపు కార్యక్రమానికి ప్రముఖులు విచ్చేస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి 1,200 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించామన్నారు. విధుల్లో అలసత్వం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

నందిగామ: మైనర్ అయిన తన కుమార్తె కనిపించడం లేదని మంగళవారం రాత్రి బాలిక తండ్రి నందిగామ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన 17 సంవత్సరాల మైనర్ బాలిక సోమవారం సాయంత్రం నుంచి కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు దగ్గర బంధువులందరినీ ఆరా తీశారు. అయినప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శత వత్సరాల విజ్ఞాన సుగ్రంథ పరిమళం

అది కేవలం గ్రంథాలయం కాదు. స్వాతంత్ర్యోద్యమంలో చైతన్య జ్వాలలు రగిలించిన విప్లవ సౌధం. ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు కాలు మోపిన పవిత్ర పుణ్యక్షేత్రం. వేల సంఖ్యలో విజ్ఞాన సంపద కొలువుదీరిన ఆలయం. శత వత్సరాలకు పైగా చరిత కల విజ్ఞాన భాండాగారం.

- వందేళ్ల చరిత్ర కొణకంచి గ్రంథాలయం సొంతం
- గ్రంథాలయంలో అందుబాటులో 24 వేల పుస్తకాలు, గ్రంథాలు
- స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర



కొణకంచిలోని శ్రీరామచంద్ర బాలభక్త గ్రంథాలయం

కొణకంచి(పెనుగంచిప్రోలు): జాతీయోద్యమంలో భాగంగా పెనుగంచిప్రోలు మండలం కొణకంచి గ్రామంలోని గ్రంథాలయం నాడు ప్రజల్లో ఎంతో చైతన్యం కలిగించింది. 2016లో ఈ గ్రంథాలయం శత వత్సర ఉత్సవాలు కూడా అంగరంగ వైభవంగా జరుపుకొంది. గ్రామానికి చెందిన కొణకంచి చక్రధరరావు, పురుషోత్తమరావు, కాకుమాను పిచ్చయ్య, నకరికంటి వెంకయ్య, చిర్రావూరి వీరభద్రయ్య తదితరులు 1916 జూలై 18న గ్రామంలో గ్రంథాలయాన్ని స్థాపించారు. దీనికి అధ్యక్షుడిగా కాకుమాను పిచ్చయ్య, కార్యదర్శిగా అయ్యదేవర లక్ష్మీనరసింహం పనిచేశారు. 1926లో గ్రంథాలయానికి శ్రీరామచంద్ర బాలభక్త గ్రంథాలయంగా పేరును స్థిరపరిచారు. దీనికి అధ్యక్షులుగా రేపాల బుచ్చిరామయ్య శ్రేష్ఠి, కార్యదర్శిగా శ్రీరామ గోవిందశర్మ వ్యవహరించారు. 1930 ఏప్రిల్ 9న గ్రంథాలయ 14వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలి శాసనసభ స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు, దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు వంటి ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, జయంతిపురం రాజు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, ఎన్జీ రంగా, మాగంటి బాపినీడు, కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వంటి ప్రముఖులు చేసిన ప్రసంగాలు ప్రజల్లో జాతీయోద్యమ స్ఫూర్తిని కలిగించాయి. సువిశాల భవనంతో పాటు ఆనాడే కళావేదికను కూడా ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. 1929లో బుచ్చిరామయ్య శ్రేష్ఠి ఆధ్వర్యంలో కొణకంచి చక్రధరరావు సంపాదకుడిగా గ్రంథాలయం నుంచి చేతిరాతతో రాసిన సుజ్ఞానప్రద పత్రికను 1945 వరకు నడిపారు. నా దేశయాత్ర సీరియల్స్కు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. ఈ పత్రిక నాడు ప్రజల్లో ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని కలిగించి జాతీయోద్యమంలో పాల్గొనేలా చేశాయి. వేల సంఖ్యలో విజ్ఞాన సంపద కొలువు దీరిన ఈ గ్రంథాలయాన్ని గ్రామస్తులు ఓ ఆలయంలా పవిత్రంగా చూస్తారు. ప్రస్తుతం గ్రంథాలయంలో 24 వేల వరకు పుస్తకాలు, గ్రంథాలు ఉన్నాయని గ్రంథాలయాధికారి రామచంద్రుడు తెలిపారు. ఎంతో పేరుగాంచిన ఈ గ్రంథాలయంలో ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పిల్లల కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం జరుగుతోంది. బాలబాలికలు ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకోవాలని గ్రంథాలయాధికారి రామచంద్రుడు కోరారు.



స్వాతంత్ర్యానికి పూర్వమే గ్రంథాలయం నుంచి నడిపిన సుజ్ఞానప్రద పత్రిక ప్రతులు

సంక్షేమ పాలనతో అన్ని వర్గాలకు లబ్ధి

గడపగడపలో ఎమ్మెల్యే జగన్మోహనరావు



నరసింహారావుపాలెంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహనరావు

వీరులపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి సంక్షేమ పాలనతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతోందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు అన్నారు. మండలంలోని నరసింహారావుపాలెం, జగన్నాధపురం గ్రామాల్లో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల క్యాలెండర్ను ప్రజలకు అందజేశారు. ఆయా గ్రామాలకు విచ్చేసిన ఎమ్మెల్యే జగన్మోహనరావుకు పార్టీ నాయకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు సాధ్యం కాని రీతిలో ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పారదర్శకంగా సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. ముఖ్యంగా నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ముఖచిత్రాలు పూర్తిగా మారిపోయాయని అర్కొన్నారు. పేద విద్యార్థుల చదువులు తల్లిదండ్రులకు భారం కాకూడదనే మంచి మనసుతో ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన, ఫీజు రీయింబర్స్మెంట్, తదితర పథకాలను ప్రవేశపెట్టి కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్య అందించటంతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నారన్నారు. మంచి మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డికి ప్రజలు మద్దతు పలికి రానున్న ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్బాబు, సర్పంచ్లు బొమ్మిశెట్టి దుర్గాదేవి, బండి విజయ్పాల్రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, వైస్ ఎంపీపీ నాగుల్మీరా, మాజీ సర్పంచ్ సుభానీ, రమావత్ రాము, పలువురు నాయకులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు



గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: జనావాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలను ఆయా స్థలాల యజమానులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వరరావు తెలిపారు. తమ వార్డులో ఉన్న ఖాళీ స్థలాల్లో కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి ఉండటంతో మరుగుగా ఉన్న ఆ స్థలాలలో విష సర్పాలు, క్రిమి కీటకాలు సంచరిస్తున్నాయని, ఫలితంగా పరిసర ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, ఆ స్థలాలలో పరిసర ప్రాంతాల ప్రజలు చెత్త, వ్యర్థాలను పడవేయడంతో ఈగలు, దోమలు, పందులు చేరి ఆ ప్రాంతమంతా అధ్వానంగా తయారై, అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని 30 వ వార్డు ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ మంగళవారం శానిటరీ ఇన్స్పెక్టర్, సిబ్బందితో కలసి ఆ వార్డులో పర్యటించారు. ఖాళీ స్థలాల యజమానులను పిలిపించి వారి స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఉంచరాదన్నారు. పరిశుభ్రంగా లేని స్థలాల యజమానులపై ప్రజారోగ్య చట్టం ప్రకారం చట్టపరంగా కేసులు దాఖలు చేయాల్సిందిగా శానిటరీ ఇన్స్పెక్టర్ను ఆదేశించారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

- రూ.20 లక్షలతో పల్లగిరిలో సీసీ రోడ్లు, డ్రైన్లు
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జగన్మోహనరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహనరావు

నందిగామటౌన్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు తెలిపారు. మండలంలోని పల్లగిరి గ్రామంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవటంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి ఆదేశాలతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గడపగడపకు కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన ప్రతి ఒక్క సమస్యను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. దీనిలో భాగంగానే ఒక్కో సచివాలయానికి ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు.

సీసీ రోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన

పల్లగిరి గ్రామ సచివాలయానికి మంజూరైన రూ.20 లక్షల్లో సీసీ డ్రైన్లకు రూ.14.35 లక్షలు కేటాయించగా సిమెంట్ రోడ్డుకు రూ.5.65 లక్షల నిధులు కేటాయించినట్లు జగన్మోహనరావు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు కనీస అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్మోహన్రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గ్రామాలలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్లతో పాటు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ చాగంటి రవికిరణ్రెడ్డి, ఉప సర్పంచ్ చిలుకూరి బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వేల్పుల రాము, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కటారపు సురేష్బాబు, నాయకులు మానుకొండా కృష్ణారెడ్డి, అలీషా, శ్రీనివాస్ రెడ్డి, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రైన్ నిర్మాణానికి స్థలం పరిశీలన



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ఒకటో వార్డులో పెద్దాయన వీధిలో డ్రెయిన్ నిర్మించనున్న స్థలాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్బాబు పరిశీలించారు. డ్రెయిన్ లేక కొంత కాలంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో మాట్లాడి డ్రైన్ నిర్మించాలని సూచించారు. దీంతో డ్రెయిన్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపారు. డ్రెయిన్ నిర్మాణానికి స్థలం కూడా లేకపోవడం వలన ప్రైవేటు వ్యక్తికి చెందిన స్థలాన్ని ఆ వీధి వాసులు సొంతంగా కొనుగోలు చేశారు. దీనికి సంబంధించిన స్థలాన్ని స్థానికులతో కలిసి వారు పరిశీలించారు. త్వరలో నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు.

గ్రామాల్లో డెంగీ అవగాహన ర్యాలీలు



అల్లూరులో ర్యాలీ చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



అనాసాగరంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

వీరులపాడు: దోమల పెరుగుదలను అరికట్టి దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైద్యాధికారులు శ్రావణ్కుమార్, గౌతమ్ అన్నారు. మండలంలోని అల్లూరు, కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా వైద్యారోగ్య సిబ్బంది డెంగీ వ్యాధిపై గ్రామంలో అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యాధికారులు మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో, ఖాళీ ప్రదేశాలలో నీటి నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి నిల్వ వలన దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏవైనా జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్వో వెంకటేశ్వరరావు, ప్రదీప్, శ్రీనివాస్, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామలో...

నందిగామ: డెంగీ వ్యాధి గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సత్యవతి సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. డెంగీ వ్యాధి లక్షణాలు, అది వ్యాపించకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రాథమిక జాగ్రత్తలు పాటిస్తూ డెంగీని అరికట్టవచ్చన్నారు. మండలంలోని లింగాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గొల్లమూడి ఆరోగ్య కేంద్రం పరిధిలో, పట్టణంలోని అర్బన్ హెల్త్ క్లినిక్ల పరిధిలో ఈ అవగాహన ర్యాలీలు జరిగాయి. అనాసాగరంలో జరిగిన ర్యాలీలో స్థానిక వైఎస్సార్ సీపీ ఇన్చార్జ్ రవీంద్ర, పలువురు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వడగాడ్పులకు జనం విలవిల

నందిగామ: నందిగామ ప్రాంతంలో గత నాలుగు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. నందిగామలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు 43.5 నమోదు కాగా రాత్రి ఉష్ణోగ్రతలు సైతం 29.1 డిగ్రీలు నమోదవుతున్నాయి. దీనికి తోడు వడగాడ్పులు కూడా వీస్తున్నాయి. ఉదయం 7 గంటల నుంచే ఎండలకు తోడు వడగాడ్పులు వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. వ్యాపార కూడళ్లు పగటి సమయంలో వెలవెలబోతున్నాయి.

సమస్యలు తెలుసుకునేందుకే వార్డుల పర్యటన

మున్సిపల్ కమిషనర్ జయరాం



వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

నందిగామ: పట్టణ ప్రజలకు మున్సిపాలిటీ ద్వారా అందుతున్న సేవలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు, ప్రజల వద్ద నుంచి సమస్యలను తెలుసుకునేందుకు ప్రతిరోజు వార్డుల పర్యటన చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. పట్టణంలోని 8 వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. ఇందులో భాగంగా వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను, స్థానిక బోరు పంపులలోని నీటి నాణ్యతను పరిశీలించారు. వార్డులో సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టామని, అన్ని ప్రాంతాలకు తాగు నీరందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాడు–నేడు పనులపై అలసత్వం వద్దు

డీఈవో సీవీ రేణుక



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రేణుక

నందిగామ: పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, ఈ విషయంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ రేణుక అన్నారు. పట్టణంలోని కె.వి.ఆర్ కాలేజ్ ఆవరణలో మంగళవారం డివిజన్ పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, విద్యాశాఖకు సంబంధించిన పలువురు సిబ్బందితో పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని వివిధ పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులకు సంబంధించి పురోగతి, పలు అంశాలపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ నాడు–నేడులో భాగంగా వివిధ పాఠశాలల్లో జరుగుతున్న పనులు పాఠశాలలు ప్రారంభించే నాటికి పూర్తవ్వాలన్నారు. విద్యార్థులకు అందించే జగనన్న విద్యా కానుకలు స్టాక్ పాయింట్కు వచ్చిన సమయంలో వాటి నాణ్యత పరిశీలించిన తరువాతే వాటిని స్వీకరించాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యం విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమేనని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ ఆలోచించి క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. అనంతరం 10 వ తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అభినందించారు. డివిజన్ ఉప విద్యాశాఖాధికారి వెంకటప్పయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



పేట గ్రంథాలయంలో విద్యార్థులకు ఇంగ్లీషు గ్రామర్లో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. పలువురు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు పలు అంశాల గురించి బోధిస్తూ వాటికి సంబంధించిన విజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులతో పుస్తకాలు చదివించి కథలు చెప్పించారు. ఉపాధ్యాయుడు వినోద్కుమార్ విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్ నేర్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు డి.నాగేశ్వరరావు, గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, బీడీసీ మల్లిక, గ్రంథాలయ సిబ్బంది శ్యామల, సత్యావతి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

19న తిరువూరులో జాబ్ మేళా

తిరువూరు: తిరువూరులో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19న మెగా జాబ్ మేళా జరుగుతుందని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, పలు ఎంఎన్సీ కంపెనీలలో టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాల భర్తీకి తిరువూరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో ఈ జాబ్మేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరువూరు ప్రాంత నిరుద్యోగులకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం ఈ జాబ్మేళా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, బీఈడీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఫార్మసీ తదితర కోర్సులు చేసిన నిరుద్యోగులకు ఈ మేళా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. తిరువూరు, విస్సన్నపేట, నూజివీడు, మైలవరం, విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఉద్యోగావకాశాలున్నాయని తెలిపారు.

గ్రంథాలయానికి కంప్యూటర్ బహూకరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కు కాకానిగా ప్రసిద్ధి చెందిన కాకాని వెంకటరత్నం 50వ వర్ధంతి పురస్కరించుకుని ఆయన మనువడు డాక్టర్ తరుణ్ కాకాని మంగళవారం బందరు రోడ్డులోని కాకాని భవన్లో గల కాకాని వెంకటరత్నం పౌర గ్రంథాలయాన్ని(ఠాగూర్ గ్రంథాలయం) సందర్శించారు. రాష్ట్రంలోని పెద్ద గ్రంథాలయాలను రాష్ట్ర ప్రభుత్వం డిజిటలైజేషన్ గ్రంథాలయాలుగా తీర్చిదిద్దే ప్రక్రియను ప్రారంభించిన నేపథ్యంలో ఆయన ఠాగూర్ గ్రంథాలయానికి అవసరమైన కంప్యూటర్ను ఏపీ గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మకు అందచేశారు. గ్రంథాలయంలో భగవద్గీత గ్రంథంలోని శ్లోకాలను పఠించిన విద్యార్థులను ప్రశంసిస్తూ వారిని ప్రోత్సహిస్తూ నగదు బహుమతిని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ తరుణ్ కాకాని మాట్లాడుతూ కాకాని వెంకటరత్నం ఆశయాల సాధన కోసం స్థాపించిన కాకాని ఆశయ సాధన సమితి తరఫున ఠాగూర్ గ్రంథాలయం ఉన్న కాకాని భవన్ అభివృద్ధికి మరింత సహాయ, సహకారాలను అందజేస్తామని తెలిపారు. బెంజి సర్కిల్ లో కాకాని విగ్రహాన్ని పునరుద్ధరించాలని, సర్కిల్కు కాకాని సర్కిల్గా నామకరణం చేయాలన్నారు. అపంతనం డాక్టర్ తరుణ్ కాకానిని గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ జమలపూర్ణమ్మ, లైబ్రేరియన్ రమాదేవి, సిబ్బంది సత్కరించారు.

21న అన్నమయ్య గ్రంథాలయ సందర్శనకు ఆహ్వానం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో 21వ తేదీ ఆదివారం గుంటూరులోని అన్నమయ్య గ్రంథాలయ సందర్శనకు కవులు, రచయితలకు ఆహ్వానం పలుకుతున్నట్లు రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయాలు మన జాతీయ సంపద, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిదీ అనే నినాదంతో రచయితల సంఘం ముందుకు వెళుతోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ సందర్శన అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. గతంలో 100 ఏళ్ల చరిత్ర కలిగిన వేటపాలెం గ్రంథాలయాన్ని కవులు, రచయితలు సందర్శించారని, ఈ నాలుగు లక్షలకుపైగా గ్రంథాలు కలిగిన అన్నమయ్య గ్రంథాలయం సందర్శనకు నిర్ణయించామని తెలిపారు. వివరాలకు 92474 79975 నంబరులో సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సంస్కృతి తెలియజేస్తూ రచయితల సంఘం ప్రచురించిన కవితా సంకలనం ఆవిష్కరణ జరుగుతుందన్నారు. సాహితీ ప్రముఖులు డాక్టర్ పాపినేని శివశంకర్, అడిగోపుల వెంకటరత్నం, అన్నమయ్య గ్రంథాలయం వ్యవస్థాపకుడు లంకా సూర్యనారాయణ పాల్గొంటారని తెలిపారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd., ఇబ్రహీంపట్నం బ్రాంచ్ వారి ... [illegible] ... S/o. ... నారాయణ, ఎన్.టి.ఆర్. జిల్లా, నందిగామ మండలం, పల్లగిరి గ్రామానికి చెందిన వారి యొక్క ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని ... [illegible] ... షెడ్యూలు: ఎన్.టి.ఆర్. జిల్లా, నందిగామ మండలం, పల్లగిరి గ్రామం, నందిగామ సబ్ రిజిష్ట్రారు వారి ... R.S.No. 111/1లోని డాక్యుమెంట్ నెం. 1180/2012 ... [illegible]

జగ్గయ్యపేట
తేది: 16-05-2023

రాయపూడి శ్రీనివాసరావు
అడ్వకేట్ & నోటరీ, సెల్: 98484 12820.
Enrolment No.: 1370/1987